


కేసీఆర్‌కు గురువారం సూర్యాపేటలోని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ నాయకుడు జుబేర్ దట్టి కట్టారు. సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి భువనగిరికి బయలుదేరే ముందు కేసీఆర్‌కు దట్టి కట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. – గజ్వేల్, ఏప్రిల్ 25


నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | MEDAK


## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- చివరి రోజు 23 మంది అభ్యర్థులు.. 36 నామినేషన్లు దాఖలు
- మెదక్ పార్లమెంట్‌కు మొత్తం అభ్యర్థులు 54 మంది, నామినేషన్లు 90
- నేడు స్క్రూట్నీ, 29న ఉపసంహరణ

మెదక్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ గడువు గురువారం మూడు గంటలకు ముగిసింది. దీంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం 23 మంది అభ్యర్థులు 36 నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గురువారం వరకు 54 మంది అభ్యర్థులు 90 నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు.




మెదక్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

# మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా

### వెంకట్రామిరెడ్డి గెలవడం ఖాయం

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



నన్ను రెండు సార్లు మూడు లక్షల మెజార్టీతో గెలిపించారని, వెంకట్రామిరెడ్డి నాలుగు లక్షల మెజార్టీతో గెలవడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలో మాయమాటలు చెప్పిన రఘునందన్‌రావును ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. అదే పరిస్థితి ఎంపీ ఎన్నికల్లో కూడా పునరావృతం అవుతుందన్నారు.

### సేవ చేయడానికి అవకాశం ఇవ్వాలి

**మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**



తెలంగాణ ప్రదాత కేసీఆర్ ఆశీస్సులతో మెదక్‌లో ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని, ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులంతా అండగా నిలవాలన్నారు. దైవసాక్షిగా చెబుతున్న నెల రోజుల్లో రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తానని, కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరుపేద యువతీ, యువకులకు అండగా నిలుస్తానన్నారు. కలెక్టర్‌గా ఖ్యాతి ఇచ్చిన మెదక్ గడ్డ ప్రజలు, సేవ చేయడానికి అవకాశం ఇవ్వాలని వెంకట్రామిరెడ్డి కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ హాల్ నిర్మించి పేదలకు అందిస్తామన్నారు. మండుటెండలో తరలివచ్చిన అశేష జనవాహినికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### హల్దీవాగులో నీళ్లు పారించిన ఘనత కేసీఆర్‌దే..

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి**



నర్సాపూర్ నియోజకవర్గంలోని హల్దీవాగులోకి నీళ్లు పారించిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావులకు దక్కుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరా పొలం ఎండిపోలేదని, కాంగ్రెస్ రాగానే 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అటకెక్కాయని, ఉన్న రైతుబంధు, 24 గంటల కరెంటు, తాగునీళ్లు కూడా అందడం లేవన్నారు. కేసీఆర్, బీఆర్‌ఎస్‌తోనే మనందరికీ శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు.



మెదక్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, చింతా ప్రభాకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, హేమలతాశేఖర్‌గౌడ్, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

- కాంగ్రెసోళ్ల కండ్లు నెత్తికెక్కినయ్
- వాళ్లను భూమ్మీదకు దించాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి
- కేసీఆర్ వల్లే మెదక్ జిల్లా అయ్యింది...
- కలెక్టరేట్ కట్టినందు వల్లే.. నువ్వు మెదక్‌కు వచ్చి నామినేషన్ వేశావ్
- బీఆర్‌ఎస్ గెలుపు.. ఆరు గ్యారెంటీల అమలుకు మలుపు
- మెదక్ రోడ్‌షోలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు

మెదక్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మెదక్ గడ్డ... గులాబీ అడ్డా.. మళ్లీ బీఆర్‌ఎస్ గెలువబోతుందని, 25 ఏండ్లల్లో మెదక్‌లో గులాబీ జెండా ఎగురుతున్నదని, వేరే జెండా ఎగురలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం మెదక్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ పార్టీ అంటే ఎండ కూడా భయపడుతున్నదన్నారు. కేసీఆర్ మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కలెక్టరేట్ నిర్మించడంతోనే రేవంత్‌రెడ్డి మెదక్‌కు వచ్చి నామినేషన్ వేశారని పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్ 1952లో ఏర్పాటైతే 1980లో ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్‌కు లేదన్నారు. మెదక్‌లో అందంగా నాలుగు లేన్ల రహదారి చేసింది కేసీఆర్ అని అన్నారు. పేగులు మెడలో వేసుకుంటా అని రేవంత్‌రెడ్డి మాట్లాడడం ఏమిటని, పేగులు మెడలో వేసుకునేది రాక్షసులు మాత్రమే అన్నారు. సీఎం స్థాయిని తగ్గించుకొని మాట్లాడుతూ సీఎం కుర్చీ ఇజ్జత్ తీస్తున్నారని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేసి బాండ్ పేపర్ మీద రాసి బాండ్ పేపర్ పరువు తీశారన్నారు. ఇప్పుడు కొత్తగా దేవుళ్లను రాజకీయాలకు వాడుతున్నారని విమర్శించారు. నువ్వు ఎవరి మీద ఒట్టు పెట్టినా నిన్ను ప్రజలు నమ్మరని హరీశ్‌రావు చెప్పారు. ఆరు గ్యారెంటీలు అమలు చేశానని చెబుతున్నావ్... ఒక్క గ్యారెంటీ అయినా అమలు అయ్యిందా అని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 అయ్యిందా, రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇచ్చారా... రూ.2000 పింఛన్, రూ.4వేలు అయ్యిందా.. కల్యాణలక్ష్మితో తులం బంగారం ఇచ్చారా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

### ఎంపీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



ఎంపీ ఎన్నికల్లో ఘన విజయం అందిస్తామని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ఏమి కోల్పోయామో మెదక్ ప్రజలు గమనించారని, 10 ఏండ్లలో మెదక్‌లో చేసిన అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. మెదక్ జిల్లా, మెదక్‌కు రైలు, రోడ్డు విస్తరణ, సాగు, తాగునీటి సౌకర్యాలు కనిపిస్తలేవా రేవంత్‌రెడ్డి అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన రోడ్డుపై వెళ్లారని, కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేశారని రేవంత్‌రెడ్డికి గుర్తుచేశారు. మెదక్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, మంజూరైన కోట్లాది రూపాయల నిధులు రద్దు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.



మెదక్ ర్యాలీలో భాగంగా బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## మెదక్‌లో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ

- పట్టణమంతా గులాబీమయం
- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- క్యాడర్‌లో నూతనోత్సాహం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25: మెదక్ పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో (రోడ్‌షో) మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేలాదిగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలిరావడంతో పట్టణమంతా గులాబీమయమైంది. పట్టణ ప్రధాన రహదారులన్నీ కిటకిటలాడాయి. జై బీఆర్‌ఎస్, జై కేసీఆర్, జై హరీశ్‌రావు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మహిళలు బోనాలు, సాంస్కృతిక కళాకారులు ఆటపాటలతో ధూంధాం చేశారు. ముఖ్యంగా యువత ఈలలు వేస్తూ కేరింతలు, చప్పట్లతో బీఆర్‌ఎస్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అంతకుముందు పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. పలు నియోజకవర్గ కేంద్రాల నుంచి బీఆర్‌ఎస్ యువత బైక్ ర్యాలీలతో తరలివచ్చారు. ర్యాలీలో ఓపెన్ టాప్ వాహనంపై మాజీమంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీచైర్మన్ బట్టి జగపతి, పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తదితరులు ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేశారు. ర్యాలీకి ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలిరావడంతో బీఆర్‌ఎస్ క్యాడర్‌లో జోష్ నింపింది. ర్యాలీలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు సుంకయ్య, కిశోర్, రాజు, బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్ గడ్డమీది కృష్ణాగౌడ్, మాజీ కౌన్సిలర్లు పెర్క కిషన్, గౌష్ ఖురేషి, సాధిక్, చంద్రశేఖర్ గౌడ్, సలీం, గట్టేశ్, నగేశ్, బాలరాజు, ముకుందం, కిష్టయ్య, అంజాగౌడ్, సంగ శ్రీకాంత్, కిషన్‌గౌడ్, కిరణ్, ఏనుగుల రాజు, చింతల నర్సింహులు, అజ్గర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ పట్టణంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కార్నర్ మీటింగ్‌కు హాజరైన అశేష ప్రజానీకం



జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## జహీరాబాద్ పార్లమెంట్‌కు 27 నామినేషన్లు

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- నేడు నామినేషన్ల పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం వరకు కొనసాగింది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 27 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో వివిధ పార్టీల నుంచి 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు అందజేశారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, భారతీయ జనతా పార్టీ నుంచి బీబీ పాటిల్ పోటీలో ఉన్నారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి దేవ శిఖామణి టీడీఎస్ మణి తిట్ల, రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ నుంచి మొహమ్మద్ మున్వర్ హుస్సేన్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి బాల్‌రాజు బట్టెంకి, టీపీఎస్ అభ్యర్థిగా కొత్త బలిజ బస్వరాజ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మాలెపు మోహన్‌రెడ్డి, ఇండియా ప్రజాబంధు తరపున బాబు దుర్గయ్య రోమల, అలియన్స్ ఆఫ్ డెమక్రెటిక్ రీఫార్మ్స్ పార్టీ తరపున మణి చావగాని, నేషనల్ మహాసభ పార్టీ నుంచి నక్క కృష్ణ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతికి అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు మారుతిరావు, మహాదేవ్ స్వామి, ప్రవీణ్, రామారావుపాటిల్, గంగారాం, రమేశ్ సజ్జాపూర్, తలారి అశోక్, జైపాల్ నాయక్ జడావత్, రమేశ్ సజ్జాపూర్, ఎండీ యాకుబ్ షరీఫ్, గొల్లపల్లి మాణయ్య, మొహమ్మద్ సద్దాం, చంటి రామకృష్ణదాస్, కిరణ్ రాథోడ్, సారిక మక్కైలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 26న నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల అధికారులు పరిశీలించనున్నారు.

# వెలవెలబోయిన బీజేపీ సభ

- సిద్దిపేటలో అమిత్ షా మాట్లాడుతుండగా దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు
- సహారా ఇండియా బాధితుల ఆందోళన

సిద్దిపేట, ఏప్రిల్ 25: సిద్దిపేటలో నిర్వహించిన బీజేపీ సభ వెలవెలబోయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్న సమయంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం వేదిక కుడివైపున ఉన్న గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ స్క్రీన్ ఎదుట ప్రజలు వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అమిత్‌షా సభకు రావడం ఆలస్యం కావడంతో ప్రజలు సభ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. అమిత్‌షా మధ్యాహ్నం1:56 నిమిషాలకు సభ వేదికపైకి చేరుకొని ప్రసంగాన్ని ప్రారంభించి 2.05 నిమిషాలకు ముగించారు. అమిత్ షా ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

### అమిత్‌షాకు నిరసన సెగ

బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభలో అమిత్‌షాకు సహారాఇండియా బాధితుల నుంచి నిరసన సెగ తగిలింది. సహారా ఇండియాలో రాష్ట్రం నుంచి చాలామంది పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. అమిత్‌షా సభ సిద్దిపేటలో ఉందని తెలుసుకొని పెద్దపల్లి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, వరంగల్ సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి సహారా ఏజెంట్లు, ఖాతాదారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సహారా ఇండియాలో పెట్టుబడులు పెట్టి నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.



సిద్దిపేట సభలో అమిత్ షా ప్రసంగించిన సమయంలో సభలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు




అమిత్‌షా విజయ సంకల్ప సభలో సహారా ఇండియా బాధితుల నిరసన



అమీన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

## వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ అందించాలి

- ముఖ్యనాయకుల సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, ఏప్రిల్ 25: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నరసింహగౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గురువారం సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయానికి ప్రణాళికాబద్ధంగా పనిచేసి రికార్డు మెజార్టీ అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. పనిమంతుడు, పరిపాలన దక్షత కలిగిన వెంకట్రామిరెడ్డిలాంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు సీఎం రేవంత్ సభ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 25: మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో శుక్రవారం నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌కు మద్దతుగా నిర్వహించే సభలో ఆయన పాల్గొననున్నారు. పెద్దశంకరంపేటలోని పద్మయ్య ఫంక్షన్‌హాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సీఎం సభను తిలకించడానికి చుట్టూ ప్రత్యేక రేలింగ్‌ను ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి పోలీస్ బృందం డాగ్‌స్క్వాడ్‌తో సభా ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సభా ఏర్పాట్లను మంత్రి దామోదర రాజనర్సింహ, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ పరిశీలించారు.